సాక్షి వరంగల్

శనివారం । 21 । జూన్ । 2025



..తలవంపులు తేవొద్దు

విద్యుత్‌శాఖ ఉద్యోగులు ఇకముందు అవినీతి, అక్రమాలకు పాల్పడొద్దని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ పేరిట ఓ లెటర్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. - 8లో▸



ముగిసిన ఎన్నికల ప్రక్రియ

కాకతీయ యూనివర్సిటీలోని ఎన్జీఓ, ఎంప్లాయీస్ అసోసియేషన్ల ఎన్నికలకు శుక్రవారం ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. 221 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం $34^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు శిల్పాల ప్రాంగణంలో యోగా దినోత్సవం

ఖిలా వరంగల్: త్రికోటలోని శిల్పాల ప్రాంగణంలో శనివారం యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కేంద్ర పురావస్తుశాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా దినోత్సవానికి మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద హాజరవుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఆసనాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు.

రైతుల ఖాతాల్లో రూ.137.74 కోట్లు జమ

ఖిలా వరంగల్: జిల్లాకు చెందిన రైతుల ఖాతాల్లో మూడో విడత రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 13 మండలాలకు చెందిన 1,48,581 మంది రైతులకు రూ.137.74 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించినట్లు పేర్కొన్నారు.

డీఆర్‌డీఏ ఏపీడీగా కృష్ణవేణి

గీసుకొండ: గీసుకొండ ఎంపీడీఏ వి.కృష్ణవేణికి డిప్యుటేషన్‌పై డీఆర్‌డీఏ ఏపీడీగా బాధ్యతలను అప్పగిస్తూ జెడ్పీ సీఈఓ జి.రాంరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గీసుకొండ మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)గా విధులు నిర్వర్తిస్తున్న పి.శ్రీనివాస్‌కు ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ఆదేశాలు జారీచేశారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు



వర్ధన్నపేట: ఎన్‌సీసీతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని 4(టీ) ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వింగ్ కమాండర్ వినోద్‌కుమార్ ఆర్య పేర్కొన్నారు. వర్ధన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 27 మంది ఎన్‌సీసీ కేడెట్లకు శుక్రవారం ఆయన ఉచిత యూనిఫామ్ కిట్‌లు అందజేసి మాట్లాడారు. ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని, క్రమశిక్షణ, నిరంతర సాధనతో యువత దేశానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. పాఠశాల మొదటి బ్యాచ్‌లో ఉత్తీర్ణత సాధించిన 22 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు 'ఏ' సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగా అనిల్‌కుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ మనుజేందర్‌రెడ్డి, యూనిట్ అడ్జెటెంట్ ఆర్‌కే శర్మ, జీసీఐ శీతల్‌రాణా, ట్రైనింగ్ ఐసీ అశోక్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు వాణి, అశోక్, కుమార స్వామి, దేవయ్య, లలిత్ కుమార్, రజని తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా సేవలందించాలి

వరంగల్ క్రైం: ప్రజలకు నిజాయితీగా సేవలందించడం ద్వారా పోలీసులపై సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన తోట వీరస్వామి, పోచయ్య, ఎం.రమేశ్, ఎం.సుధాకర్, పి.రమేశ్ శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈసందర్భంగా సీపీ చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం ద్వారా షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి ఈనెల 22 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి పి.భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు ఒకటో తరగతిలో 60 సీట్లు, ఐదో తరగతిలో 62 సీట్లు కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈనెల 26న కలెక్టరేట్ సమావేశ మందిరంలో డ్రా తీయనున్నట్లు వివరించారు. దరఖాస్తులను వరంగల్, నర్సంపేట సాంఘిక సంక్షేమ అధికారి కార్యాలయాల్లో సమర్పించాలని, పూర్తి వివరాలకు సంబంధిత కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై కేసు

గీసుకొండ: గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు గీసుకొండ సీఐ ఎ.మహేందర్ తెలిపారు. ఎలుకుర్తిహవేలిలో కొందరు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై కుమార్ వెళ్లారు. గంజాయి సేవిస్తున్న మార్త విశాల్, అల్లం రఘు, నర్సింగోజ్ హరీశ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ అని తేలడంతో కేసు నమోదు చేశామన్నారు.

పచ్చదనం పరిఢవిల్లేలా..

- వనమహోత్సవానికి అధికారుల ప్రణాళికలు
- జిల్లాలోని 337 నర్సరీల్లో 32,02,510 మొక్కలు సిద్ధం
- జూలై మొదటి వారం నుంచి నాటేందుకు సన్నాహాలు
- 26 ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం



ముదిగొండలోని హరిచంద్రునాయక్ తండా నర్సరీలో వనమహోత్సవానికి సిద్ధంగా ఉన్న మొక్కలు

నెక్కొండ: వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం జిల్లాలోని 337 నర్సరీల్లో 32,02,510 మొక్కలను పెంచుతున్నారు. ఈసారి 31,04,272 మొక్కలు నాటేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏఏ ప్రాంతాల్లో ఎన్ని నాటాలో ఆయా మండలాల అధికారులకు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకొని ఈ ఏడాది 70 నుంచి 80 రకాల మొక్కలు నాటనున్నారు. నర్సరీల్లో పెంచుతున్న పలు రకాల పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను కాపాడేందుకు ఉపాధి హామీ పథకం కింద సంరక్షకులను నియమించి పర్యవేక్షిస్తున్నారు. నాటిన ఒక్కో మొక్కకు రూ.150 ఖర్చుచేసి రెండేళ్ల వరకు కాపాడనున్నారు. మొత్తం 26 శాఖలు పచ్చదనం పరిఢవిల్లేలా కృషిచేయనున్నాయి.

ఒక్కో నర్సరీకి రూ.1.40 లక్షల ఖర్చు



ఉపాధిహామీ పథకంలో భాగంగా జిల్లాలోని 323 పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. వీటితోపాటు అటవీ శాఖ రెండు, జీడబ్ల్యూఎంసీ నాలుగు, నర్సంపేట మున్సిపాలిటీ 7, వర్ధన్నపేట మున్సిపాలిటీలో ఒకటి చొప్పున నర్సరీలు ఉన్నాయి. మొత్తం 337 నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఒక్కో నర్సరీలో సుమారు 10 వేల మొక్కలు పెంచే దిశగా ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం నర్సరీకి సుమారు రూ.1.40 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. నర్సరీల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించారు.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు..

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండ నుంచి సంరక్షించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సరీలకు షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయడంతోపాటు రోజుకు రెండుసార్లు నీటిని అందిస్తున్నారు. ఈ ఏడాది అన్ని నర్సరీలు డీఆర్‌డీఓ, అటవీశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఉన్నతాధికారులు ఆయా నర్సరీలను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. జూలై మొదటి వారం నుంచి విద్యాసంస్థలు, వసతిగృహాలు, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శాఖల వారీగా నాటనున్న మొక్కల వివరాలు..

శాఖ	మొక్కలు	శాఖ	మొక్కలు
పంచాయతీ రాజ్	1,27,700	పశుసంవర్ధక శాఖ	30,720
జిల్లా వ్యవసాయ మార్కెట్ కార్యాలయం	2,400	మత్స్య శాఖ	800
ఉద్యాన	1,07,832	గనులు, భూగర్భ వనరులు	7,900
సెరికల్చర్	1,00,000	గ్రేటర్ వరంగల్	7,50,000
జిల్లా కోఆపరేటివ్ కార్యాలయం	2,520	నర్సంపేట మున్సిపాలిటీ	2,50,000
డీఈఓ	40,000	వర్ధన్నపేట మున్సిపాలిటీ	1,84,900
జిల్లా పరిశ్రమలు	6,000	వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ (ఐసీడీఎస్)	2,800
డీఎంహెచ్ఓ	1,600	ఎస్సీ కార్పొరేషన్	400
జిల్లా పంచాయతీరాజ్	7,09,300	బీసీ కార్పొరేషన్	800
డీఆర్‌డీఓ	5,60,000	మైనార్టీ కార్పొరేషన్	400
ఎక్సైజ్	1,28,700	గిరిజన సంక్షేమశాఖ	1,400
అటవీ శాఖ	36,600	పౌరసరఫరాల శాఖ	4,000
ఇరిగేషన్	47,600	పోలీస్ శాఖ	5,000

ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు అందజేస్తాం..



వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. ఇందుకోసం 337 నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. జూలై మొదటి, రెండు వారాల్లో మొక్కలు నాటుతాం. వీటితోపాటు ప్రతి ఇంటికి ఆరు పండ్లు, పూలు, ఔషధ మొక్కలు అందజేస్తాం. ఆయా శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో వనమహోత్సవ లక్ష్య సాధనకు కృషిచేస్తాం.

\- కౌసల్యాదేవి, డీఆర్‌డీఓ

రవి అంతిమయాత్రలో పాల్గొన్న అభిమానులు, గ్రామస్తులు



వెలిశాల.. శోకసంద్రం

- మావోయిస్టు నేత గాజర్ల రవికి కన్నీటి వీడ్కోలు
- ఎర్రజెండాలతో ఎరుపెక్కిన గ్రామం
- తరలివచ్చిన ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు
- నివాళులర్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



చితికి నిప్పపెడుతున్న సోదరుడు అశోక్

టేకుమట్ల: మూడు దశాబ్దాలుగా పీడిత ప్రజల విముక్తి కోసం ఉద్యమ బాట పట్టి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన గాజర్ల రవి అలియాస్ గణేశ్ అంత్యక్రియలు స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలలో శుక్రవారం ముగిశాయి. రంపచోడవరంలో గురువారం రాత్రి పోస్టుమార్టం అనంతరం రవి పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించగా శుక్రవారం ఉదయం 8:30 గంటలకు స్వగ్రామమైన వెలిశాలకు చేరుకుంది. ఉద్యమ గీతాలతో కవులు, కళాకారులు, ఉద్యకారులు ఉద్యమాల బిడ్డా, నిను మరువదు ఈ గడ్డ అంటూ నివాళులర్పించారు. కాగా, రవి మృతదేహాన్ని వెలిశాలకు తీసుకొస్తున్న సమయంలో చిట్యాల, చల్లగరిగలో వాహనాన్ని ఆపి పలువురు నివాళులర్పించారు.

ఎరుపెక్కిన వెలిశాల..

గాజర్ల రవి అలియాస్ గణేష్ అంత్యక్రియల నేపథ్యంలో గ్రామంలో పెద్దఎత్తున ఎర్రజెండాలు, రవి చిత్రాలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆయన పార్థీవ దేహం వెలిశాలకు చేరుకోగానే ఉద్యమ గీతాలతో హోరెత్తించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలైన అంతిమయాత్ర కూతవేటు దూరానికే సుమారు నాలుగు గంటల పాటు కొనసాగింది. ఉద్యమ నినాదాలు, గీతాలు, డప్పు కళాకారుల దరువులకు వెలిశాల దద్దరిల్లింది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప ఉద్యమ గీతాలు, నృత్యాలతో విప్లవానికి చావు లేదనే విధంగా ఆడి పాడారు. అంతిమ యాత్ర ప్రారంభం నుంచి చివరి అంకం వరకు ఉద్యమ గీతాలు, నృత్యాలతో హోరెత్తించారు.

భారీగా తరలివచ్చిన అభిమానులు

గాజర్ల రవికి అంతిమ వీడ్కోలు తెలిపేందుకు మాజీ మావోయిస్టులు, ప్రజాసంఘాల నాయకులు, కవులు, గాయకులు, ప్రజలు, అభిమానులు తరలిరావడంతో వెలిశాల జన సంద్రమైంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపడుతున్న మారణహోమాన్ని వెంటనే ఆపాలని, ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షా కనుసన్నల్లో పని చేస్తున్నాడని భారత్ భచావో అధ్యక్షుడు, తెలంగాణ సిద్ధాంతకర్త గాదె ఇన్నయ్య, విమలక్క మండిపడ్డారు. హక్కులు సాధించుకోవాలంటే పోరాడాలని అమ్మే నేర్పిందని గాజర్ల రవి సోదరుడు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు అన్నారు. కష్టమున్న చోట ఎదిరించి పోరాడమని వెలిశాల చెప్పిందని అన్నారు. దొరలు, పెత్తందారులు చేసే అరాచకాల నుంచి పీడిత ప్రజల విముక్తి కోసం గాజర్ల కుటుంబం పోరాడిందని.. ఆ క్రమంలో పోలీసులు పెట్టిన చిత్రహింసలు వెలిశాల ప్రజలకు తెలుసన్నారు. చివరికి అన్నయ్య రవన్న మృతదేహాన్ని సైతం రంపచోడవరం ఆస్పత్రిలో చూపించకుంటే పోలీసులను ప్రశ్నిస్తేనే చూపించారని అన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు..

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, తీన్మార్ మల్లన్న గాజర్ల రవి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన అంతిమయాత్ర అనంతరం గాజర్ల రవి అలియాస్ గణేశ్ సోదరుడు అశోక్ అలియాస్ ఐతు చితికి నిప్పంటించారు.

అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి

- కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి నిధులు తెస్తాం
- దిశ చైర్మన్ పోరిక బలరాంనాయక్, కోచైర్‌పర్సన్ కడియం కావ్య
- కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి మానిటరింగ్ కమిటీ సమావేశం



దిశ సమావేశంలో పాల్గొన్న ఎంపీలు బలరాం నాయక్, కావ్య, ఎమ్మెల్సీ సారయ్య, కలెక్టర్ సత్యశారద తదితరులు

న్యూశాయంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి అధికారులు సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని, కేంద్రంతో కొట్లాడి నిధులు తెచ్చే బాధ్యత తమదని జిల్లా అభివృద్ధి సహకార, మానిటరింగ్ కమిటీ (దిశ) చైర్మన్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కోచైర్‌పర్సన్, వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. కలెక్టరేట్‌లో ఎంపీ పోరిక బలరాంనాయక్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన దిశ కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ కేంద్రం నిధులతో చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కేంద్ర పభుత్వ పరిధిలోని 29 శాఖల పనితీరుతోపాటు వరంగల్ జిల్లాలో సాగు నీటిపారుదల ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రాజెక్టులకు నిధులు తెచ్చి జిల్లాను ప్రగతి పథంలో తీసుకెళ్తామని చెప్పారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు జిల్లాలో ఆస్పత్రుల పనితీరును మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, నిబంధనలు అతిక్రమించే ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్లు గౌరవంగా బతికేందుకు సాయం అందించాలని కోరారు. వరి, ఇతర పంట ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఎయిడెడ్ పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గాల వారీగా పరిష్కరించిన సమస్యలను అధికారులు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కొలతల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోవాలి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



దుగ్గొండి: తొగర్రాయిలో ఇంటి మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

దుగ్గొండి/నల్లబెల్లి: ప్రభుత్వ కొలతల ప్రకారమే లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. దుగ్గొండి మండలం తొగర్రాయి, నల్లబెల్లి మండలంలోని నందిగామ, రేలకుంట, రంగాపురం, మూడుచెక్కలపల్లి, ముచ్చింపుల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ముచ్చింపులలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే దొంతి మాట్లాడుతూ కొలతల ప్రకారం కాకుండా ఇళ్లు నిర్మించుకుంటే బిల్లులు ఇచ్చేటప్పుడు సమస్యలు వస్తాయన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేస్తానని, అర్హులకు దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బిల్లులను లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా ప్రభుత్వం జమచేస్తోందని పేర్కొన్నారు. తొగర్రాయిలో జరిగిన కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ నర్సంపేటఅధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, దుగ్గొండి మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, గ్రామ ప్రత్యేక అధికారి డాక్టర్ శారద, నల్లబెల్లి మండలంలో జరిగిన కార్యక్రమాల్లో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ణాటి పార్వతమ్మ, నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, మాలోత్ రమేశ్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

నర్సంపేట రూరల్: వివాహిత అదృశ్యమైన సంఘటన రాజేశ్వర్‌రావుపల్లి గ్రామంలో జరిగిందని నర్సంపేట ఎస్సై అరుణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజేశ్వర్‌రావుపల్లి గ్రామానికి చెందిన బింగి శ్రీనివాస్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీనివాస్ భార్య మమత గురువారం రాత్రి ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. శ్రీనివాస్ అర్ధరాత్రి లేచి చూసేసరికి కనిపించకపోవడంతో చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికాడు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో నర్సంపేట పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

చిట్టి చేతులు.. గట్టి సంకల్పం

- ప్రభుత్వ పాఠశాలల్లో 'ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్'
- పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం
- ఒక్కో పీఎం శ్రీ స్కూల్‌కు రూ.10 వేల చొప్పున నిధులు



విద్యారణ్యపురి: ఆధునిక సమాజంలో అభివృద్ధి పేరిట మానవాళి చర్యలతో పర్యావరణానికి నష్టం కలుగుతోంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతిని మానవాళిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. జీవవైవిధ్యానికి కూడా ముప్పువాటిల్లుతోందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఈనేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఉపక్రమించింది. అందులో భాగంగా కేంద్ర విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని రూపొందించింది. పర్యావరణ పరిరక్షణలో నూతన దిశగా విద్యార్థులను భాగస్వాములు చేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నారు.

ఆగస్టు నెలాఖరులోపు ఎకోక్లబ్‌లు

ఆగస్టు 31 లోపు హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లను నూతనంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రతీ పాఠశాలలోనూ ఎకోక్లబ్‌ల నిర్మాణ కార్యకలాపాలు ఇలా ఉండనున్నాయి.

నీటి నిల్వ క్లబ్: నీటి పొదుపు, సంరక్షణపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

నేల నిర్వహణ క్లబ్: నేల సంరక్షణ స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై దృష్టి

శక్తి నిర్వహణ క్లబ్: శక్తి వనరుల సమర్థవంతమైన వినియోగం

- వ్యర్థ నిర్వహణ క్లబ్ వ్యర్థాల తగ్గింపు, రీసైక్లింగ్, జీవ వైవిధ్య క్లబ్: జీవ వైవిధ్య సంరక్షణ, పరిరక్షణ.
- పాఠశాలల్లో విద్యార్థులతో ఎకోక్లబ్ కమిటీల ఏర్పాటు ఒక్కో ఎకోక్లబ్‌లో చురుకైన 10 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో పాఠశాలలో 50మంది విద్యార్థులను ఈకార్యక్రమంలో భాగస్వాములను చేస్తారు. వీరంతా పర్యావరణ పరిరక్షణకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాల విద్యాశాఖ అధికారులు హెచ్ఎంలను ఇప్పటికే ఆదేశించారు.

విద్యార్థులకు అవగాహన సదస్సులు

ఎకో క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు వివిధ అవగాహన సదస్సులను నిర్వహిస్తారు. శక్తి ఆదా విద్యుత్ ఇతర శక్తి వనరులు ఎలా ఆదా చేయాలనేది, నీటి వృథాను అరికట్టి సంరక్షణ పద్ధతులను తెలియజేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంపై అవగాహన కల్పిస్తారు. తదితర కార్యక్రమాలతో పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వామ్యం చేయనున్నారు.

పీఎంశ్రీ స్కూళ్లకు నిధులు..

హనమకొండ జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 492 పాఠశాలలు ఉండగా.. అందులో 145 ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూళ్లు ఉన్నాయి. వరంగల్ జిల్లాలో 634 పాఠశాలలున్నాయి. అందులో 142 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. కాగా.. ఏకోక్లబ్ ఫర్ మిషన్‌లైఫ్ కార్యక్రమాల నిర్వహణకుగాను హనుమకొండ, వరంగల్ జిల్లాలోని పీఎం శ్రీ స్కూల్స్‌కు ఒక్కో స్కూల్‌కు రూ.10 వేల చొప్పున నిధులు కూడా మంజూరయ్యాయి. వరంగల్ జిల్లాలో 14 పీఎం శ్రీస్కూళ్లకు, హనుమకొండ జిల్లాలో 16 పీఎంశ్రీ స్కూళ్లకు ఒక్కో స్కూల్‌కు రూ.10 వేల చొప్పున నిధులు మంజూరయ్యాయి. మిగతా పాఠశాలల్లో ఎకోక్లబ్‌లను ఏర్పాటు చేసుకున్నప్పటికీ వాటిల్లో కార్యక్రమాల నిర్వహణకు నిధులు మంజూరు అనేది లేదు.

అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసుకోవచ్చు..



ఎకోక్లబ్‌లను అన్ని పాఠశాలల్లోనూ ఏర్పాటు చేసుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణకు వివిధ కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. సంవత్సరం పొడవునా నిర్వహించే వివిధ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు వీడియోలు ఎప్పటికప్పుడు ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్‌కు సంబంధించిన పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

\- సుజన్‌తేజ, కమ్యూనిటీ మొబిలైజింగ్ కో-ఆర్డినేటర్, వరంగల్

గతంలో కంటే మరింత మెరుగ్గా..



పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల విద్యార్థుల ద్వారా కమిటీలను ఏర్పాటు చేసుకుని పర్యావరణ పరిరక్షణకు కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. సహజ సిద్ధంగా ప్రకృతిని యథావిధిగా ఉండేలా పర్యావరణ సమతుల్యతకు చేపట్టాల్సిన కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. ముఖ్యంగా విద్యార్థులు ఈక్లబ్‌ల ద్వారా అవగాహన పర్చుకోవడం మొక్కలను కూడా నాటడం చేయాల్సి ఉంటుంది. వాటిని సంరక్షించాల్సి ఉంటుంది. పీఎం శ్రీ స్కూల్స్‌కు నిధులు మంజూరు ఇచ్చినందున ఆ నిధులను కూడా కార్యక్రమాల నిర్వహణకు ఆయా స్కూల్స్ ఎకో క్లబ్‌లు వినియోగించుకోవచ్చును

\- శ్రీనివాస్, కమ్యూనిటీ మొబిలైజింగ్ కో-ఆర్డినేటర్, హనుమకొండ

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి



చెంగల రమేశ్ (ఫైల్)

వర్ధన్నపేట: తాటి చెట్టు పైనుంచి పడి ఓ గీతకార్మికుడు మృతి చెందిన సంఘటన కట్ర్యాలలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు, బీజేపీ యువమోర్చా నియోజకవర్గ కన్వీనర్ చెంగల రమేశ్ శుక్రవారం తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రమేశ్ మృతికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లు స్వాధీనం





లభ్యమైన జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లు

పర్వతగిరి: వ్యవసాయ భూమిలోని బండరాళ్లను పగులగొట్టడానికి ఎలాంటి అనుమతి లేకుండా ఉపయోగిస్తున్న పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం ప్రకారం.. కొంకపాక గ్రామ శివారు గోపనపల్లి గ్రామానికి చెందిన ఓరైతు తన వ్యవసాయ పొలంలో బండరాళ్లను పగులగొట్టడానికి పేలుడు పదార్థాలను ఉపయోగిస్తున్నాడని సమాచారం అందింది. ఈ మేరకు శుక్రవారం పోలీసులు తనిఖీలు చేసి 90 జిలెటిన్ స్టిక్స్, 39 డిటోనేటర్లతోపాటు కంప్రెషర్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ యజమాని పవన్ కల్యాణ్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

నకిలీ విత్తనాలు అమ్మిన వ్యక్తిపై తొలిసారి పీడీ యాక్టు


పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ గోపి

రామన్నపేట : నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయించిన వ్యక్తిపై రాష్ట్రంలో తొలిసారి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పీడీ యాక్టు ఉత్తర్వులు జారీ చేశారు. మట్టెవాడకు చెందిన ఇరుకుళ్ల వేద ప్రకాశ్‌పై సీపీ జారీ చేసిన పీడీ యాక్టు ఉత్తర్వులను శుక్రవారం మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి నిందితుడికి పరకాల జైలులో అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. నిందితుడు వేదప్రకాశ్ మరో నిందితుడితో కలిసి ముఠాగా ఏర్పడ్డాడు. గత నెల 7వ తేదీన రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తూ మట్టెవాడ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో పోలీసులు నిందితుల నుంచి సుమారు రూ. 49 లక్షల 52 వేల విలువైన నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, నిందితుడు వేదప్రకాశ్ 26వ తేదీన నకిలీ పురుగుల మందులు విక్రయిస్తుండడంతో మట్టెవాడ పోలీసులు మరోసారి అరెస్ట్ చేశారు. దీంతో నిందితుడిపై సీపీ సన్‌ప్రీత్‌సింగ్ పీడీ యాక్టు నమోదు చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు. ఎవరైనా నకిలీ మందులు విక్రయిస్తే 7799848333 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కోర్టులో బాంబు కలకలం..


- బాంబ్ స్క్వాడ్ తనిఖీల్లో జిలెటిన్ స్టిక్స్ లభ్యం
- ఊపిరి పీల్చుకున్న కక్షిదారులు

వరంగల్ లీగల్ : హనుమకొండ ఒకటవ అదనపు సెషన్స్ కోర్టులో బాంబు కలకలం సృష్టించింది. గుర్తుతెలియని వ్యక్తి డయల్ 100కు కాల్ చేసి కోర్టులో బాంబు ఉందని చెప్పాడు. దీంతో పోలీసులు పెద్ద ఎత్తున ఘటనాస్థలికి చేరుకుని శుక్రవారం ఉదయమే కోర్టు సమయం నుంచి కక్షిదారులు, న్యాయవాదులను తనిఖీ చేసిన అనంతరం కోర్టు ప్రాంగణంలోకి అనుమతించారు. కాగా, చాలా సంవత్సరాల (దాదాపు 20 పైగా) క్రితం ఓ క్రిమినల్ కేసులో పోలీసులు స్వాధీనం చేసుకున్న జిలెటిన్ స్టిక్స్‌ను హనుమకొండ ఒకటవ అదనపు సెషన్స్ కోర్టుకు అందజేశారు. కేసు పరిష్కారమైనా నాడు స్వాధీనం చేసుకున్న ఏడు జిలెటిన్ స్టిక్స్ కోర్టు ప్రాపర్టీ రూంలోనే ఉండిపోయాయి. ఈ క్రమంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీల్లో ఈ పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. దీంతో సంబంధిత కోర్టు ఏడు జిలెటిన్ స్టిక్స్‌లో ఒకటి నిర్వీర్యం కావడంతో మిగతా ఆరింటిని పోలీసులకు అప్పగించింది. దీంతో కక్షిదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఏప్రిల్ 23న కూడా కోర్టులో అనుమానాస్పద సూట్‌కేస్ బాంబు కలకలం రేపింది. గతంలో ఉభయ జిల్లాల న్యాయస్థానాల అధికారిక ఈమెయిల్‌కు తమిళనాడు చెందిన ఓ తీవ్రవాద సంస్థ పేరుతో కోర్టులో బాంబులు పేలుస్తామని మెస్సేజ్ వచ్చింది.

ఆసనం.. ఆరోగ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం | యోగాకు అంబాసిడర్ 'భారతదేశం'

- ఐరాసలో 177 దేశాల మద్దతు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



పోటీ ప్రపంచంలో జీవనం ఉరుకులు, పరుగుల మయమైపోయింది. సమయానికి ఉన్న విలువ అంతా ఇంతా కాదు. వృత్తిపర, వ్యక్తిగత ఒత్తిళ్లు.. వెంటాడుతున్న కాలుష్య భూతంతో ధరిచేరే రోగాలు.. వెరసి ఏది చేద్దామన్నా ఇబ్బందే. వీటన్నింటి నుంచి ఉపశమనానికి యోగా చక్కటి ఔషధమని నిపుణులు శాస్త్రీయంగా నిరూపించారు. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత యోగాకు విశేష ప్రాముఖ్యత కల్పిస్తూ వచ్చారు. ఆయన చొరవతోనే ఐక్యరాజ్యసమితి.. జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. యోగా దినోత్సవాన్ని వేడుకగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం నాడే తీర్మానించింది. ఈ నేపథ్యంలో నేడు యోగా డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

-జనగామ/ పాలకుర్తి టౌన్

మినీ స్టేడియంలో యోగా దినోత్సవం



పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో నేడు ఉదయం 7 గంటలకు యోగా దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినం. అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొనాలి. ప్రస్తుత జీవనశైలిలో మానసిక ఒత్తిడిని అధిగమించడం, ఆరోగ్యం మెరుగు పరచుకోవడానికి యోగా దివ్యఔషధం. అందుకే ప్రతీ ఒక్కరు రోజు వారీగా యోగాసనాలు వేయాలి.

రిజ్వాన్ బాషా, కలెక్టర్, జనగామ

అన్ని రోగాలకు ఇదే మందు..

చిన్న రోగాలకు సైతం పాశ్చాత్య వైద్యం వైపు పరుగులు తీసే ఈ రోజుల్లోనూ యోగా అన్ని రోగాలకు సంజీవనిలా మారింది. యోగా అభ్యసనం మనిషికి ఆరోగ్యం, శక్తి, తేజస్సు, చురుకుదనం అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. యోగాలో అంతర్భాగమైన సరళ విన్యాసాన్ని అనుసరిస్తే దేహరక్షణ సిద్ధించడంతోపాటు మనోవికాసం వృద్ధి చెందుతుందని వారు పేర్కొంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న సమయంలో యోగా విద్యకు ఆదరణ పెరగడానికి కారణం ఇదే. ఈ కారణంగానే నేడు దేశం మొత్తం యోగాపై ఆసక్తి కనబర్చుతోంది. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యమని, ముఖ్యంగా మనసును ఆధీనంలో ఉండాలంటే యోగా తప్పనిసరి అని అంటున్నారు.

కఠిన ఆసనాల జోలికి వెళ్లొద్దు..

యోగా అభ్యసనం ఎప్పుడూ ప్రకృతికి దగ్గరగా ఉండడం సత్ఫలితాలు ఇస్తుంది. ఎంచుకున్న స్థలం ఎత్తు పల్లాలు లేకుండా సమాంతరంగా ఉండాలి. స్థిరంగా ఒక భంగిమలో కూర్చోవాలి. చల్లని వాతావరణం, వెలుతురు, గాలి వచ్చేలా ఉన్న స్థలాన్ని ఎంచుకోవాలి. శక్తికి మించిన వ్యాయామాలు చేయకుండా కొద్దిగా ప్రాక్టీస్ చేసుకోవాలి. గుండె, మధుమేహం, బీపీ ఉన్న వారు కఠిన ఆసనాల జోలికి వెళ్లకుండా గురువుల సమక్షంలోనే అభ్యసనం చేయాలి.

యోగాలో అష్టాంగ మార్గాలు..



భారతదేశం యోగాకు అంబాసిడర్. క్రీస్తుశకం 4వేల సంవత్సరంలో ఉత్తర భారత దేశానికి చెందిన పతంజలి మహర్షి యోగా శాస్త్రంలో నిబంధనలు జోడించారు. మానవుల ఆరోగ్యం కోసం క్రమ పద్ధతిలో యోగాను గ్రంథస్తం చేశారు. ఈ గ్రంథాలను మహర్షి మహేష్ యోగి వ్యాప్తిలోకి తీసుకొచ్చారు. పతంజలి మహర్షి యోగాలో అష్టాంగ మార్గాన్ని రూపొందించి, ఇందులో మయం, నియమమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహం, ధ్యానం ధారణం, సమాధి సూత్రాలను ప్రపంచానికి అందించారు. ఇందులో మయం, నియమం, ఆసనం, ప్రాణాయామాలను హట యోగాంగా వర్ణించారు. బాహ్య శరీరాన్ని క్రమబద్ధీకరించడంలో ఇవే మూల ఆసనాలు. ఎక్కువ సమయం లేని వారు కనీసం 20 నిమిషాలు సూర్యనమస్కార ఆసనాలతో పాటు ప్రాణాయామం చేస్తే సరిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం, ఉబ్బసం, కీళ్ల నొప్పులు, పక్షవాతం, చర్మవ్యాధులు, మైగ్రేన్ లాంటి వ్యాధుల నివారణకు యోగా ఉపయోగపడుతుంది.

ఐరాసలో అధిక దేశాల మద్దతు..

భారత గడ్డపై పుట్టిన ఎన్నో కళలు ప్రపంచమంతా విస్తరించాయి. కాలక్రమంలో తన మూలాలను మార్చుకుని పొరుగు దేశాల్లో స్థానికంగా నిలిచిపోయాయి. కరాటే, కుంగ్‌ఫూ వంటి విద్యలు ఈ కోవలోనివే. కానీ కాలం మారినా భారతీయ మూలాల్లోనే మనుగడ సాధిస్తున్న విద్య యోగా ఒక్కటే. 193 సభ్య దేశాలున్న ఐక్యరాజ్య సమితిలో ప్రధాని మోదీ ప్రవేశ పెట్టిన యోగా డే ప్రతిపాదనకు 177 దేశాలు మద్దతు ప్రకటించాయి. ఐరాస సర్వసభ్య సమావేశాల్లో ఒక తీర్మానానికి ఈ స్థాయిలో మద్దతు రావడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. ఇదిలా ఉండగా జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియం, బతుకమ్మకుంట, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల్లో ఉదయం యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్యం..



యోగా ఆరోగ్యాన్ని కాపాడుతుంది. మనకు తెలియకుండా తీసుకునే ఆహారంలో విషపదార్థాలు ఉంటున్నాయి. దీంతో మధుమేహం, అధిక బరువు, గుండె జబ్బు వంటి వ్యాధులు సోకుతున్నాయి. ఫలితంగా 40 ఏళ్లకే వివిధ వ్యాధులతో మంచం పట్టాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోజూ 30 నిమిషాలు యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంది. దీనిని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి.

-తమ్మి స్రవంతి, గృహిణి, పాలకుర్తి

ఆరోగ్యం పంచాలనే ఉద్దేశంతో



ప్రజలకు ఆరోగ్యం పంచాలనే ఉద్దేశంతోనే శ్రీ పరివార్ ఆధ్వర్యంలో ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా మహిళలు, చిన్నారులకు ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. యోగాసనాల ద్వారా ఆరోగ్యంగా ఉంచాలన్నదే మా ముఖ్య ఉద్దేశం.

-పెండ్లి రాజు బాపూజీ, యోగా గురువు,పాలకుర్తి

యోగా అంటే..?

యోగా అంటే సాధారణంగా శ్వాసను క్రమబద్ధీకరించడం, శారీరక వ్యాయామం, శరీర కదలికలు మాత్రమే కాదు. యోగా మేధస్సు, ఆత్మకు సంబంధించిన శక్తిని పెంపొందించుకునే అద్భుత సులువైన ప్రక్రియ. విజ్ఞాన శాస్త్ర పరిభాషలో యోగా అంటే వ్యక్తుల పరిపూర్ణ జీవనసారం. ఇందులో జ్ఞాన, భక్తి, కర్మ, రాజ యోగాల మిళితమై ఉంటాయి. మనం వేసే ఆసనాలు రాజయోగమైతే వాటిద్వారా జ్ఞాన, భక్తి, కర్మ యోగాలను వ్యక్తిలో సమపాలల్లో ఉంచడానికి ఉపకరించేదని అర్థం. ప్రాచీన భారతంలో ఆయుర్వేద చికిత్సలో అనారోగ్యం నుంచి ఉపశమనానికి యోగాను ఔషధంలా పాటించాలని సూచించే వారు.

27న అప్రెంటిస్‌షిప్ జాబ్‌మేళా


మాట్లాడుతున్న డీఐఈఓ గోపాల్

విద్యారణ్యపురి: 2022 -2025 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం ఈనెల 27న హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో అప్రెంటిస్‌షిప్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని, దీనిని వినియోగించుకోవాలని హనుమకొండ డీఐఈఓ ఎ. గోపాల్ కోరారు. జాబ్‌మేళా సన్నాహక సమావేశం శుక్రవారం హనుమకొండ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో హనుమకొండ, ములుగు, నెల్లికుదురు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు శ్రీధర్, ఎం.పి భగవద్గీత, ఎ. శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నవ్వసి శ్రీనివాస్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గూడ్స్ షెడ్‌కు చేరిన 1,315 మెట్రిక్ టన్నుల యూరియా


యూరియా వ్యాగన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌సీఎఫ్ కంపెనీ ప్రతినిధులు, ఏఓ రవీందర్ రెడ్డి

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేస్టేషన్‌లోని గూడ్స్ షెడ్‌కు శుక్రవారం ఉదయం ఆర్‌సీఎఫ్ కంపెనీకి చెందిన 1,315 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల కోసం చేరిన యూరియా వ్యాగన్‌ను ఆర్‌సీఎఫ్ కంపెనీ మేనేజర్ పురుషోత్తం రాథోడ్, ఖమ్మం డిస్ట్రిక్ ఇన్‌చార్జ్ అభిజిత్ గాంధీతో కలిసి మండల వ్యవసాయ అధికారి రవీందర్‌రెడ్డి పరిశీలించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు యూరియాను మార్క్‌ఫెడ్‌కు 60శాతం, ఫర్టిలైజర్ డీలర్లకు 40 శాతం కేటాయిస్తామని కంపెనీ నిర్వాహకులు తెలిపారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా చూస్తామని, త్వరలోనే మరో వ్యాగన్ వచ్చే అవకాశం ఉందని కంపెనీ మేనేజర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గణేశ్, కంపెనీ సెల్స్ మేనేజర్లు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

- వరంగల్ కలెక్టర్ సత్యశారద


వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో పీడియాట్రిక్ విభాగానికి పరికరాలు అందించిన దాతల సహకారం అభినందనీయమని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవారం ఎంజీఎం పీడియాట్రిక్ విభాగానికి బిలియన్ హార్ట్స్ బ్రీతింగ్ ఫౌండేషన్, జనప్రియ సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ. 60 లక్షల విలువైన పీడియాట్రిక్ విభాగానికి అవసరమయ్యే ఎక్స్ రే, ఈసీజీ మెషిన్, పారా మానిటర్లు, డబుల్ సర్ఫేస్ ఫొటో థెరపీ వంటి 13 వివిధ రకాల పరికరాలను ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ సత్యశారద ప్రారంభించి మాట్లాడారు. దాతలు అందించిన పరికరాలతో చిన్నారులకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. అనంతరం దాతలను సన్మానించారు. బిలియన్ హార్ట్స్ బ్రీతింగ్ ఫౌండేషన్ కంట్రీ హెడ్ సుధా జిజారియా, జనప్రియ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎండీ సతీశ్ కుమార్, ఎంజీఎం పర్యవేక్షకులు కిశోర్, డీఎంహెచ్ఓ సాంబశివరావు, ఆర్ఎంఓలు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేఎంసీలో..

వైద్య, శాస్త్రీయ రంగాల్లో పరిశోధనలకు మద్దతుగా కాకతీయ మెడికల్ కళాశాలలో మల్టీ డిసిప్లీనరీ రీసెర్చ్ యూనిట్‌ను శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ సుధారాణి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. జిల్లాను ఆరోగ్య కేంద్రంగా అభివృద్ధి చేయడంలో ఈయూనిట్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి, డీహెచ్ఆర్ ప్రాజెక్టు డైరెక్టర్ సునీల్‌పంత్, ప్రతినిధులు కుమార్ విక్రమ్, నర్సంపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, అధ్యాపకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

గ్లాస్ పగిలి వ్యక్తి మృతి

- లక్నవరం 3వ ఐలాండ్‌లో ఘటన


హర్షపాల్ సింగ్ మృతదేహం

గోవిందరావుపేట: మండలంలోని లక్నవరం సరస్సులోని 3వ ఐలాండ్ 'ది కావ్ రిసార్ట్స్'లో వర్క్ చేస్తుండగా గ్లాస్ పగిలి జార్ఖండ్‌కు చెందిన హర్షపాల్ సింగ్ (40)కి గాయమైంది. దీంతో హుటాహుటిన ములుగు ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు.

తప్పులు చేసి తలవంపులు తేవొద్దు..

నిజాయితీగా ఉంటేనే గౌరవం

- ప్రజలు టీజీఎన్పీడీసీఎల్ గురించి గొప్పగా చెప్పుకోవాలి
- సీఎండీ పేరిట ఓ లెటర్ సోషల్ మీడియాలో వైరల్

మెరుగైన వేతనాలు అందజేస్తున్నా కక్కుర్తే ..

చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చేసేందుకు లంచం అడిగిన మహబూబాబాద్ విద్యుత్ శాఖ ఎస్ఈ నరేశ్ రూ. 80వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. మరికొన్ని నెలల్లో ప్రమోషన్‌పై మరింత ఉన్న స్థాయికి చేరే సమయంలో ఎస్ఈ.. అవినీతి నిరోధక శాఖకు చిక్కడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎన్పీడీసీఎల్‌లో క్షేత్ర స్థాయి నుంచి.. ఉన్నత స్థాయి ఉద్యోగుల వరకు మెరుగైన వేతనాలు అందజేస్తున్నారు. ఇతర శాఖలతో పోలిస్తే ప్రమాద బీమా, ఇతర ప్రయోజనాలు కూడా ఎక్కువే.. ఇంత చేసినా ఏదో ఒక చోట అధికారులు కాసులకు కక్కుర్తి పడి వినియోగదారులు, కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టడం.. ఏసీబీకి చిక్కడం గమనార్హం.

సాక్షి, మహబూబాబాద్ : 'తప్పులు చేసి తలవంపులు తేవొద్దు.. నిజాయితీగా పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండాలి. టీజీ ఎన్పీడీసీఎల్ గురించి ప్రజలు గొప్పగా చెప్పుకునే రోజులు రావాలి.. ఒక్కరిద్దరు చేసిన అవినీతి, అక్రమాలతో సంస్థకు చెడు పేరు వస్తోంది.. ఇక ముందు నుంచి ఎవరూ అవినీతి, అక్రమాలకు పాల్పడొద్దు.. మీ కెరీర్ నాశనం చేసుకోవద్దు..' అని టీజీ ఎన్పీడీసీఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ పేరిట ఓ లెటర్ శుక్రవారం సోషల్ మీడియాలో వైరలైంది. విద్యుత్ శాఖతోపాటు, జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

సీఎండీ పేరిట లెటర్ వైరల్ ..

మహబూబాబాద్ విద్యుత్ శాఖ ఎస్ఈ నరేశ్ ఏసీబీకి చిక్కిన నేపథ్యంలో ఆ శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి పేరిట లెటర్ వైరలవుతోంది. ఆ శాఖలోని అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగుల వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వైరలవుతోంది. ఆ మెస్సేజ్‌లో ...'నిన్న, మన సీనియర్ అధికారి ఒకరు తన ప్రవర్తన ద్వారా శాఖను అవమానపరిచారు. అలాగే, శాఖలో అవినీతి గురించి ప్రజల అభిప్రాయాన్ని మళ్లీ బలోపేతం చేశారు. తన అసహ్యకర ప్రవర్తనతో కెరీర్‌ను నాశనం చేసుకున్నారు. మనలో చాలామంది నిజాయితీపరులు, కష్టపడి పనిచేసే వారు ఉన్నారని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నా. అయితే, నిన్నటి సంఘటన మన కంపెనీలో జరిగిన ఏకైక సంఘటన కాదు. అయినా దురాశతో కుళ్లిన మనస్తత్వం ఉన్న వ్యక్తులు చాలా తక్కువ మంది ఉన్నారు. వారు తమ స్వార్థం కోసం కుటుంబ సభ్యులు, సంస్థకు అప్రతిష్టను తీసుకురావడమే కాకుండా, ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తారు. కర్మ బలంగా ప్రతీకారం తీర్చుకుంటుందని నేను గట్టిగా నమ్ముతున్నా. అయితే అలాంటి చెడు పనులన్నింటికీ కొంచెం ఆలస్యం కావొచ్చు. అలాంటి అక్రమ సంపద ఎక్కువ కాలం ఉండదు లేదా మిమ్మల్ని శాంతితో ఉంచదు. అలాంటి వ్యక్తులందరూ ఇప్పటికీ తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవచ్చు. నిజాయితీ, కృషి , సమగ్రతతో కూడిన వృత్తిపరమైన జీవితాన్ని గడపొచ్చు. వృత్తి నైపుణ్యం, సమగ్రత, కృషికి పేరుగాంచిన మనందరి గురించి ప్రజలు గొప్పగా మాట్లాడుకునే రోజును చూడాలనుకుంటున్నా. మనమందరం సేవ చేయాలనే లక్ష్యంతో ఏకాభిప్రాయంతో పనిచేయాలని, మన వినియోగదారులకు అధిక నాణ్యత గల సేవలు అందించాలని నేను కోరుకుంటున్నా. తప్పుడు ప్రవర్తనకు పాల్పడే వ్యక్తుల సంఖ్య కొద్ది మంది నుంచి సున్నాకి తగ్గే రోజు రావాలి. అధికారులు అందరికీ దారి చూపే ఆదర్శ స్తంభంగా నిలబడాలి.' అని మెస్సెజ్‌ను సీఎండీ ముగించారు. కాగా, ఈ మెస్సెజ్‌పై ఆ సంస్థలోని ఉద్యోగులు అవినీతి పరుల మార్పు కోరుంటున్నామని పేర్కొంటుండగా.. ఉద్యోగుల్లో మార్పు వస్తే అంతకన్నా ఏం కావాలని వినియోగదారులు అంటున్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

- డీఆర్ఓ వైవీ.గణేశ్


మాట్లాడుతున్న డీఆర్ఓ వైవీ.గణేశ్

హన్మకొండ అర్బన్: గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, వాటి బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి వైవీ. గణేశ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు 'నషా ముక్త్ భారత్ అభియాన్' జిల్లా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జూన్ 26న నిర్వహించే అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, నార్కొటిక్స్ డీఎస్పీ సైదులు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, డీఈఓ వాసంతి, కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, సామాజిక కార్యకర్త ఈవీ.శ్రీనివాసరావు, ఎఫ్ఆర్ఓ రవికృష్ణ, హోప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఆచార్య, హెల్పింగ్ హ్యాండ్స్ డీఅడిక్షన్ కేంద్రం రాము, మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక అవగాహన జిల్లా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీల సత్యాగ్రహ దీక్ష

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బీసీల సత్యాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ దీక్షలో బీసీ ప్రజలు, విద్యార్థులు, యువకులు, ప్రజా సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీసీ విద్యార్థులకు ప్రభుత్వం షరతులు లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, పూలే విదేశీ విద్యా జ్యోతి పథకం కింద విదేశాలకు పంపే బీసీ విద్యార్థుల సంఖ్యను 300 నుంచి 2000కు పెంచాలని, సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

స్టార్ హోటల్ లుక్‌తో మోడల్ రన్నింగ్ రూం..

- నేడు దక్షిణ మధ్య రైల్వే జీఎం చేతుల మీదుగా ప్రారంభం


కాజీపేట జంక్షన్‌లో రైల్వే జీఎం ప్రారంభించనున్న మోడల్ రన్నింగ్ రూం

కాజీపేట రూరల్ : రైల్వే శాఖ కాజీపేట జంక్షన్‌లో మెన్, ఉమెన్ లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్లు, ట్రైన్ మేనేజర్ల కోసం మోడల్ రన్నింగ్ రూంను స్టార్ హోటల్ లుక్‌తో నిర్మించింది. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా సకల సౌకర్యాలతో నిర్మించిన మోడల్ రన్నింగ్ రూం భవన సముదాయాన్ని శనివారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట స్టేషన్ ఎదుట గల పాత రన్నింగ్ రూం స్థానంలో ఈ మోడల్ రన్నింగ్ రూంను నిర్మించారు. సుమారు రూ. 7.50 కోట్ల వ్యయంతో స్టార్ హోటల్ లుక్‌తో 57 గదులు, 140 బెడ్ల సౌకర్యంతో నిర్మించిన ఈ భవన సముదాయంలో మెన్, ఉమెన్ ఎల్పీలు, ఎల్పీలు, ట్రైన్ మేనేజర్లు వేర్వేరుగా ఉండేందుకు సకల సదుపాయాలు కల్పించారు. కాజీపేట రైల్వే లోకోపైలెట్ కార్యాలయం కేంద్రంగా కాజీపేట-సికింద్రాబాద్, విజయవాడ, బల్లార్షా రూట్‌లో విధులు నిర్వహించే ఆన్‌లైన్ రన్నింగ్‌స్టాఫ్ ఈ రన్నింగ్ రూం భవనంలో విశ్రాంతి తీసుకుంటారని అధికారులు తెలిపారు.

అండర్-19 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక


అండర్-19 ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టుతో డబ్ల్యూడీసీఏ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల చివరి వారం నుంచి జరగనున్న అండర్-19 లీగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తుది జాబితాను వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన అంతర్‌జిల్లాల స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి జట్టులో స్థానం కల్పించినట్లు తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్, సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, శంకర్, పవన్ నేతృత్వంలో ఎంపిక ప్రక్రియ జరిగినట్లు తెలిపారు. జిల్లా జట్టుకు బి. సాత్విక్, వి. ప్రీతేశ్, పి. రంగారావు, ఓ. సుకుమార్, బి. దయానంద్, జె. విశ్వక్‌సాయి, పి. శ్రీకాంత్, ఎం. మనీశ్ కుమార్, డి. మన్‌దీప్‌సింగ్, ఎం. పుజిత్, వి. అశ్విత్, బి. చరణ్, సి. జశ్వంత్, బి. మనోజ్, కె. రిత్విక్, బి. వితేశ్, ఎం. రాంచరణ్, ఎం. రాణాచరణ్, స్టాండ్ బైలుగా ప్రవీణ్, పార్థిషన్, లక్ష్మణ్ ఎంపికైనట్లు తెలిపారు.

ముగిసిన ఉద్యోగ సంఘాల ఎన్నికల ఓటింగ్


ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎన్జీఓ ఎంప్లాయీస్, క్లాస్ ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ల ఎన్నికలకు శుక్రవారం ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. కేయూ పరిపాలన భవనంలోని సెనేట్‌హాల్, సుబేదారిలోని యూనివర్సిటీ కాలేజీ, ఖమ్మం పీజీసెంటర్, భద్రాద్రికొత్తగూడెం ఇంజనీరింగ్‌కాలేజీలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ జరిగింది. కేయూ ఎన్జీఓ అసోసియేషన్‌లో 222 మంది ఓటర్లు ఉండగా 221 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌లో 79 మంది ఓటర్లు ఉండగా 76 మంది ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకన్నారు. ఎన్నికల అధికారిగా ప్రొఫెసర్ కె.రాజేందర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా పంజాల శ్రీధర్ వ్యవహరించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ప్రణయ్‌కుమార్, బి.నేతాజీ, నర్సింహారావు, సూపరింటెండెంట్ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఓట్ల లెక్కింపు ..

ఉద్యోగాల సంఘాల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈనెల 21న ఉదయం 11గంటలకు జరగనుంది. లెక్కింపు అనంతరం సంబంధిత అధికారులు ఫలితాలు వెల్లడిస్తారు.